

20 వరకు ఎల్లెల్సీకి నీరు

హొళగుంద: తాగునీటి అవసరాల నిమిత్తం టీబీ డ్యాం నుంచి ఎల్లెల్సీకి ఈ నెల 20వ తేదీ వరకు నీటి విడుదల కొనసాగించాలని టీబీ బోర్డు అధికారులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.



స్పందించిన అటవీ శాఖ సిబ్బంది

శ్రీశైలంటెంపుల్: నల్లమల నడకమార్గంలో ఎమ్మిగనూరుకు చెందిన వృద్ధురాలు అస్వస్థతకు గురికావడంతో అటవీశాఖ సిబ్బంది స్పందించారు. డోలి సహాయంతో ఆమెను కైలాస ద్వారానికి చేర్చారు.

ఉష్ణోగ్రత

కనిష్టం	25.4
గరిష్టం	40.0

న్యూస్‌రీల్

రేపు ఎస్‌జీటీలకు పదోన్నతులు

కర్నూలు సిటీ: జిల్లాలో సెకండరీ గ్రేడ్ టీచర్స్(ఎస్‌జీటీ)లకు ఈ నెల 9వ తేదీన పదోన్నతులు కల్పించనున్నట్లు డీఈఓ కె.శామ్యూల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన ఉపాధ్యాయులు తమ వెంట సర్వీసు రిజిష్టర్ తెచ్చుకుని డీఈఓ కార్యాలయంలో వెరిఫికేషన్ చేయించుకోవాలని, ఆ తరువాత సీనియారిటీ జాబితాల్లోని వారికి పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. సీనియారిటీ జాబితా డీఈఓ బ్లాగ్‌స్పాట్‌లో అందుబాటులో ఉందని తెలిపారు. స్కూల్ అసిస్టెంట్(స్పెషల్ ఎడ్యుకేషన్)రెండు బ్యాక్‌లాగ్ పోస్టులు, ఒక జనరల్ రోస్టర్ పాయింట్ ఉందని ఆయన పేర్కొన్నారు.

కల్లూరు సబ్ రిజిస్ట్రార్‌గా నాసిర్

కర్నూలు (సెంట్రల్): కల్లూరు సబ్ రిజిస్ట్రార్‌గా ఎస్.నాసిర్ నియమితులయ్యారు. ఈయన ప్రస్తుతం వైఎస్సార్ జిల్లా పులివెందులలో పని చేస్తున్నారు. ఐజీ ఆదేశాల మేరకు కల్లూరు సబ్ రిజిస్ట్రార్‌గా నియమితులయ్యారు. ప్రస్తుతం ఇక్కడ సబ్ రిజిస్ట్రార్‌గా ఉన్న హాజీ మియ్య తన సొంత స్థానమైన నంద్యాల జిల్లా రిజిస్ట్రార్ ఆఫీసులో రిపోర్టు చేసుకోనున్నారు.

రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను త్వరగా పంపిణీ చేయాలి

కర్నూలు(సెంట్రల్): ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను త్వరగా పంపిణీ చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. గురువారం ఉదయం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా ఎంఎస్ఎంఈ సర్వే, ఎన్నికల అంశాలు, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్‌పై జిల్లా ఉన్నతాధికారులు, మండలాధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ... పెండింగ్‌లో ఉన్న ఆరోగ్యశ్రీ కార్డులను వెంటనే పంపిణీ చేయాలన్నారు. జిల్లాలో ఎంఎస్ఎంఈ సర్వేలో భాగంగా ఇప్పటి వరకు 138 పరిశ్రమలను గుర్తించి యాప్‌లో నమోదు చేశారని, మిగిలిన ప్రదేశాల్లో ఉండే పరిశ్రమలను రెండు మూడు రోజుల్లో గుర్తించాలన్నారు.

10న అంబేడ్కర్ గురుకులాల ప్రవేశ పరీక్ష

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల/కళాశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్ ప్రవేశ పరీక్ష ఈ నెల 10న నిర్వహిస్తున్నట్లు ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ జిల్లా కోఆర్డినేటర్ డా.ఐ శ్రీదేవి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కర్నూలు జిల్లాలో 8, నంద్యాల జిల్లాలో 6 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 5వ తరగతిలో 1,040 సీట్లకు 11 వేలు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో 1,400 సీట్లకు 7,551 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. 5వ తరగతి విద్యార్థులకు ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు.



శ్రీశైల పుర వీధిలో కిక్కిరిసిన భక్తజనం



పట్టువస్త్రాలు తీసుకొస్తున్న మంత్రి సత్యనారాయణ, ఎమ్మెల్యే శిల్పా, చైర్మన్, ఈఓ



పాతాళగంగకు పోటెత్తిన భక్తులు

నేడు మహాశివరాత్రి పర్వదినం

- పరమశివునికి పాగాలంకరణ ప్రత్యేకం
- అర్ధరాత్రి మహారుద్రాభిషేకం, స్వామిఅమ్మవార్లకు కల్యాణం
- జాగరణకు తరలివస్తున్న భక్తజనం





అదిగదిగో శ్రీశైలం.. భూలోకాన కైలాసం

శ్రీశైలంటెంపుల్: ద్వాదశ జ్యోతిర్లింగాల్లో శ్రీగిరికి ఓ ప్రత్యేక స్థానం ఉంది. ఇక్కడ మల్లన్నకు జరిగే విశిష్ట సేవలు దేశంలోనే ఏ క్షేత్రంలో జరగవు. శ్రీశైలంలో మల్లన్నకు పాగాలంకరణ ఒక విశిష్ట సేవ. మహాశివరాత్రి పర్వదినాన లింగోద్భావ కాలంలో జరిగే ఈ సేవ వెనుక ఎన్నో ఆధ్యాత్మిక అంశాలు నిక్షిప్తమై ఉన్నాయి. పాగాలంకరుడైన మల్లన్నను చూసేందుకు భక్తుల రెండు కళ్లు చాలవు. భూమి, నీరు, నిప్పు, గాలి, అకాశాన్ని పంచభూతాలుగా పరిగణిస్తారు. వీటి సమ్మేళనమే ఈ భౌతిక ప్రపంచం. ఈ పంచభూతాలకు ప్రతీకలుగా మల్లన్న ఆలయంలోని ఐదు కలశాలు. స్వామివారి గర్భాలయ విమాన గోపురానికి మధ్యలో ఒకటి, నాలుగు మూలలో నాలుగు కలశాలు ఉన్నాయి. గర్భాలయ ముఖమండపంపై తొమ్మిది నందులు ఉన్నాయి. ఈ నవ నందులను, ఐదు కలశాలను కలిపి పాగా చుడతారు. 4కలశాలు, 9 నందులు మొత్తం 14. అంటే 14 లోకాలను ఏలే శ్రీలింగ చక్రవర్తికి ఈ సంఖ్యతో కూడిన పాగాలంకరణ జరగడం విశేషం. తద్వారా 14 లోకాలకు మల్లన్న అనుగ్రహం పరిపూర్ణంగా ఉండాలని, లోక కల్యాణం జరగాలన్న ఆకాంక్షలను స్వామివారికి భక్తులు తెలియజేయడమే ఈ పాగాలంకరణ వెనుక ఉన్న మరో విశేషం. సాలే గూడు శ్రీకాళహస్తీశ్వర మహాత్యం గురించి తెలియని శివ భక్తులు ఉండరు. అందులో శ్రీ అంటే సాలె పురుగు. శివలింగంపై ఎండపడకుండా భక్తితో అది గూడు అల్లుతుంది. తద్వారా పరమశివుడి అనుగ్రహం పొందుతుంది. శ్రీశైలం మల్లన్నకు జరిగే పాగాలంకరణ సాలెగూడును పోలి ఉంటుంది. 14 చుట్లు చుట్టిన పాగాలంకరణ దర్శనం వలన 14 ఇంద్రియాలు నిర్మలమైన బాధల నుంచి విముక్తి పొందుతాయన్న ఆధ్యాత్మిక సందేశం ఇందులో ఇమిడి ఉంది.

గజ వాహనంపై మల్లన్న విహారం

శ్రీశైలం శివనామస్మరణతో మారుమోగుతుంది. ఎటు చూసిన ఓంకార ధ్వనులే వినిపిస్తున్నాయి. మల్లన్న సన్నిధిలో జాగరణ చేసేందుకు లక్షలాది మంది భక్తులు కొండపైకి చేరుకున్నారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఏడవ రోజు గురువారం రాత్రి గజరాజుపై మల్లికార్జునుడి వైభవాన్ని భక్తులు కనులారా వీక్షించి ఆధ్యాత్మిక అనుభూతిని పొందారు. ముందుగా ఉభయ దేవాలయ ప్రాంగణంలోని అలంకార మండపంలో ఉత్సవమూర్తులను గజ వాహనంపై ఉంచి ఆలయ ప్రదక్షిణ చేయించారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణి రెడ్డి , ఈవో డి.పెద్దిరాజు దంపతులు గంగాధర మండపం వద్ద గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. జానపద కళాకారుల నృత్య ప్రదర్శనలు, డ్రమ్స్, డప్పులు,తప్పెట్లు, మేళతాళాలు, భజంత్రీలు, శంఖానాదాల కోలాహలం నడుమ గ్రామోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. గజవాహనంపై దర్శనమిచ్చిన స్వామిఅమ్మవార్లను భక్తులు కన్నులారా దర్శించి కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఈ పూజా కార్యక్రమంలో బ్రహ్మోత్సవాల ప్రత్యేక అధికారి చంద్రశేఖర ఆజాద్, ధర్మకర్తల మండలి సభ్యులు, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



గజవాహనంపై కొలువైన భ్రామరీ సమేత మల్లికార్జునుడికి ఆలయ ప్రదక్షిణ చేస్తున్న దృశ్యం



ఉత్సవంలో మహిళల కోలాటం



ఆకట్టుకున్న ప్రదర్శన

రాష్ట్ర ప్రభుత్వం తరపున మల్లన్నకు పట్టువస్త్రాలు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆనవాయితీగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. రాష్ట్ర డిప్యూటీ సీఎం, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి దంపతులు పట్టువస్త్రాలు తీసుకురాగా ఆలయ రాజగోపురం వద్ద అర్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మంత్రి, ఎమ్మెల్యే, దేవస్థాన ట్రస్ట్‌బోర్డు చైర్మన్, ఈఓ పట్టువస్త్రాలు, ఫలపుష్పాలు, పసుపు కుంకుమ, గాజులు తలపై పెట్టుకుని స్వామిఅమ్మవార్లకు సమర్పించారు.

పాగాలంకరణకు సర్వం సిద్ధం

మహాశివరాత్రి పర్వదినాన శుక్రవారం రాత్రి 10గంటల నుంచి 12గంటల లోపు లింగోద్భవ సమయంలో పాగాలంకరణ జరుగుతుంది. ప్రకాశం జిల్లా చీరాల మండలం జాండ్రపేట హస్తినాపురం గ్రామానికి చెందిన చేనేత పృథ్వీ వెంకటేశ్వర్లు పాగా వస్త్రంతో శ్రీగిరికి చేరుకున్నారు. అలాగే గురువారం వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు తీసుకువచ్చిన పాగాను దేవస్థాన పరిపాలన భవనంలో అధికారులకు అప్పగించారు. స్వామివారికి దిక్కులే వస్త్రాలు. అందుకే పాగాలంకరణ సేవ చేసేవారు దిగంబరంగానే ఉండి కార్యాన్ని పూర్తి చేస్తారు. ఆ సమయంలో ఆలయం, పరిసరాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తారు. పాగాలంకరణ పూర్తయ్యాక విద్యుత్ వెలుగులు నింపుతారు. పాగాలంకరణ సమయంలో మల్లన్నకు లింగోద్భావకాల మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం జరుగుతుంది. అనంతరం కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు.



పాగాలంకరణకు సిద్ధంగా ఉంచిన పాగా



పాదయాత్రగా శ్రీశైలం చేరుకుంటున్న భక్తులు

శ్రీగిరికి పోటెత్తిన భక్తులు..

మహాశివరాత్రి అత్యంత పవిత్రమైన రోజు. మహా శివరాత్రి నాడు ఉపవాసం ఉండి జాగరణ చేస్తే సకల శుభాలు కలుగుతాయని విశ్వసించిన లక్షలాది మంది భక్తులు శ్రీగిరి చేరుకున్నారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులతో శ్రీగిరి పోటెత్తింది. భక్తుల శివనామస్మరణతో మారుమోగుతుంది. క్షేత్రంలో శివస్వాములు, భక్తుల శివభజనలు, శివనామస్మరణ, ఓంకార ధ్వనులతో శ్రీశైలం మరింత అధ్యాత్మికతను సంతరించుకుని ఇలకైలాసాన్ని తలపిస్తుంది.

స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటు గర్వకారణం

- రూ.120 కోట్లతో నిర్మించాం
- ఒక్క లీనీస్ ఎక్స్‌లేటర్ మిషన్‌కు రూ.54 కోట్లు ఖర్చు చేశాం
- ప్రైవేటుకు మిన్నగా ప్రభుత్వ ఆసుపత్రుల నిర్మాణం
- రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌ను ప్రారంభించి అందులో సౌకర్యాలను పరిశీలిస్తున్న మంత్రి బుగ్గన

కర్నూలు(హాస్పిటల్): స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌ను కర్నూలులో ఏర్పాటు చేసుకోవడం గర్వకారణమని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, శాసనసభ వ్యవహారాలు, వాణిజ్య పన్నుల నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. గురువారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రూ.120కోట్లతో నిర్మించిన స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌ను, రూ.3.46కోట్లతో నిర్మించిన 10 బెడెడ్ బర్న్స్ యూనిట్‌ను, రూ.3.22కోట్లతో నిర్మించిన ఎగ్జామినేషన్ హాల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎలాంటి క్యాన్సర్‌కైనా మెరుగైన పరికరాలతో అన్ని రకాల స్పెషలిస్టు వైద్యులతో సామాన్యుడు ఇక్కడ చికిత్స పొందే అవకాశం ఉందన్నారు. ఈ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లోని పరికరాలలో ఒక లీనియర్ ఎక్స్‌లేటర్‌ను రూ.54కోట్లతో కొనుగోలు చేశామన్నారు. ఈ పరికరం పెద్ద పెద్ద ఆసుపత్రుల్లో కూడా ఉండదన్నారు. అలాగే అడ్వాన్స్ సిటీ స్కాన్, ఎక్స్‌రే స్కాన్, ఎంఆర్ఐ స్కాన్, బెడ్ స్కాన్ వంటి పరికరాలతో ముంబాయి లాంటి పెద్ద పెద్ద నగరాల్లో ఉపయోగించే 3 డీ థర్మోస్కోపిక్ పరికరం కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. ఇందులో 250 మంది వైద్యులు, సిబ్బంది పనిచేస్తున్నారు, అన్ని రకాల సూపర్‌స్పెషలిస్టులు ఉన్నారని తెలిపారు. దీని నిర్మాణానికి రూ.120కోట్లు ఖర్చు అయితే అందులో కేవలం పరికరాల కోసం రూ.84కోట్లు, భవనాల నిర్మాణం కోసం రూ.36కోట్లు ఖర్చు చేశారన్నారు.

వైద్యానికి అధిక ప్రాధాన్యం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఎన్ని మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేశారో అంతకంటే ఎక్కువ మెడికల్ కాలేజీలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏర్పాటయ్యాయని మంత్రి గుర్తు చేశారు. నాడు–నేడు కింద పీహెచ్‌సీలు, హెల్త్ సెంటర్లు, హాస్పిటల్స్, మెడికల్ కళాశాలల రూపురేఖలు మార్చామన్నారు. వైద్యానికి తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. ఏకంగా 3వేలకు పైగా రోగాలకు ఉచితంగా ఆరోగ్యశ్రీలో చికిత్స అందిస్తున్నట్లు వివరించారు. కర్నూలు మెడికల్ కాలేజీ ఆధునికీకరణకు వందల కోట్లను ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిడిరెడ్డి, కర్నూలు శాసన సభ్యులు హఫీజ్‌ఖాన్, వైఎస్సార్‌సీపీ కర్నూలు నియోజకవర్గ సమన్వయకర్త ఇంతియాజ్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, మెడికల్ కాలేజి ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టినర్సమ్మ, సీఎస్‌ఆర్ఎంవో డాక్టర్ బి. వెంకటేశ్వర రావు, డిప్యూటీ సీఎస్‌ఆర్ఎంవో డాక్టర్ హేమనళిని, ఆర్ఎంవో డాక్టర్ వెంకటరమణ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రేణుకాదేవి, డాక్టర్ హరిచరణ్, డాక్టర్ సాయి సుధీర్, క్యాన్సర్ విభాగం హెచ్‌వోడీ డాక్టర్ సీఎస్‌కే ప్రకాష్, ఏపీఎంఎస్ఐడీసీ ఎస్ఈ రమేష్‌రెడ్డి, ఈఈ శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

రూ.12 కోట్లతో మాస్టర్ ప్లాన్



కలెక్టరేట్ ఆధునికీకరణ ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు కలెక్టరేట్ భవన సమూదాయాన్ని రాష్ట్రంలోనే ఉత్తమంగా తీర్చిదిద్దుతామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ఆర్థిక శాఖమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. కలెక్టరేట్ చుట్టూ ఉండే ఏ క్యాంపు ప్రాంతాన్ని రూ.12 కోట్లతో తీర్చిదిద్దుతామని, ఇందుకోసం మాస్టర్ ప్లాన్‌ను రూపొందిస్తున్నట్లు చెప్పారు. గురువారం రూ.8.08 కోట్లతో ఆధునికీకరించిన కలెక్టరేట్ భవన సమూదాయాన్ని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్, కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జేసీ నారపురెడ్డి మౌర్యతో కలసి మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆధునికీకరించిన కలెక్టరేట్ సమూదాయంలో ఆయన పర్యటించారు. అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సునయన ఆడిటోరియాన్ని కంట్రీ క్లాస్ ఆడిటోరియంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. ఎక్కడ అభివృద్ధి అన్న వారందరికీ కలెక్టరేట్ ఆధునికీకరణే సమాధానమన్నారు. సిల్వర్ జూబ్లీ కాలేజీ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. కాలేజీ కోసం రూపాయికే బియ్యాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. అంతకముందు కలెక్టరేట్ ఆధునికీకరణపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను మంత్రి తిలకించారు. కార్యక్రమంలో కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవ్‌తేజ, డీఆర్వో కె.మధుసూదన్‌రావు, ఆర్డీఓ ఎం.శేషిరెడ్డి పాల్గొన్నారు.


మహిళా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేస్తున్న డీఆర్వో కె.మధుసూదన్‌రావు, ప్రజాప్రతినిధులు

కర్నూలు(సెంట్రల్): మహిళా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాలను అమలు చేస్తోందని డీఆర్వో కె.మధుసూదన్‌రావు అన్నారు. ప్రభుత్వం అందించిన ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గురువారం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అనకాపల్లి నుంచి వరుసగా నాలుగో ఏడాడి వైఎస్ఆర్ చేయూత నిధులను బటన్ నొక్కి మహిళల ఖాతాల్లో జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్ నుంచి వర్చువల్‌గా డీఆర్వో కె.మధుసూదన్‌రావు, డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక, డీసీఎంఎస్ చైర్మన్ శిరోమణి మద్దయ్య, కార్పొరేటర్ సత్యనారాయణమ్మ, డీఆర్‌డీఏ పీడీ సలీంబాషా, మెప్మా పీడీ నాగశివలీల వీక్షించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ.. వైఎస్సార్ చేయూత పథకం కింద 45 నుంచి 60 ఏళ్ల మహిళలకు ప్రతియేటా ప్రభుత్వం రూ.18,750 చొప్పున అందజేస్తోందన్నారు. నాలుగేళ్లలో ఒక్కో మహిళకు రూ.75 వేలు అందజేసినట్లు చెప్పారు. నాలుగో విడత 1,27,626 మందికి రూ.239.30 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. అనంతరం లబ్ధిదారులకు అధికారులు, ప్రజాప్రతినిధులు మెగా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ అధికారి శ్రీనివాస కుమార్ పాల్గొన్నారు.


రూ.75 వేలు వచ్చింది



ఇప్పటి వరకు నాకు మూడు విడతల్లో చేయూత కింద రూ.56,250 జమ అయ్యింది. నాలుగో విడత కింద ఈ రోజు మరో 18,750 వచ్చింది. మొత్తం రూ.75 వేలు రావడంతో బర్రెలు కొనుగోలు చేసి పాల వ్యాపారం చేస్తున్నాను. డైరీ ఫామ్‌తో ఎవరిపై ఆధారపడకుండా జీవనం సాగిస్తున్నా. నా కుమార్తె, కుమారులకు జగనన్న విద్య, వసతి దీవెన పథకాలు అందుతున్నాయి.

–జి.అరుణ, దిన్నెదేవరపాడు

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు



చేయూత కింద నాకు ఇప్పటి వరకు మూడు విడతల్లో రూ.56,250 రావడంతో ఎద్దులు కొనుగోలు చేశా. మాకు పొలం ఉండడంతో వ్యవసాయం చేసుకొని జీవనం సాగిస్తున్నాం. మాకు రైతు భరోసా కింద యేటా రూ.13,500 అందుతోంది. నా మనవడికి అమ్మ ఒడి కింద రూ.15 వేలు ఇస్తున్నారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి పేదల పక్షపాతి. ఆయనకు కృతజ్ఞతలు.

– వెంకటలక్ష్మమ్మ, కల్లూరు

క్లుప్తంగా

భగ్గుమంటున్న భానుడు

● కర్నూలులో 40 డిగ్రీల ఉష్ణోగ్రత

కర్నూలు(అగ్రికల్చర్): భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. కర్నూలు నగరంలో ఫిబ్రవరి మొదటి పక్షం నుంచే ఎండల తీవ్రత పెరిగింది. కొద్ది రోజులుగా పెరుగుతూ వస్తున్న ఉష్ణోగ్రతలు గురువారం 40 డిగ్రీలకు చేరింది. జిల్లాలోని పత్తికొండలో 39.79, కృష్ణగిరి మండలంలో 38.75, కోడుమూరులో 38.73, సి.బెళగల్‌లో 38.70, దేవనకొండలో 38.70 డిగ్రీల ప్రకారం ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నంద్యాల జిల్లాలోని పాణ్యంలో 38.9, కొత్తపల్లిలో 38.9, బేతంచెర్లలో 38.59, గడివేములలో 38.39, అవుకులో 38.59 డిగ్రీల ప్రకారం నమోదయ్యాయి.

'మహిళా అగ్నివీర్'కు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(హాస్పిటల్): ఇండియన్ ఆర్మీలో 10వ తరగతి విద్యార్హతతో మహిళా అగ్నివీర్ ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన సర్వీసుల శాఖ అధికారి పీవీ రమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జనరల్ డ్యూటీ ఉద్యోగాలకు(4 సంవత్సరాల షార్ట్ టర్మ్ సర్వీసు) తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణాలోని మహిళా అభ్యర్థుల నుంచి జోనల్ రిక్రూట్‌మెంట్ కార్యాలయం చెన్నై వారు ఆన్‌లైన్ ద్వారా https:// joinindianarmy.nic.in ద్వారా దరఖాస్తులకు నోటిఫికేషన్ జారీ చేశారని పేర్కొన్నారు. అభ్యర్థులు ఈ నెల 22వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పదో తరగతిలో 45 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఉండాలని, వయస్సు 17.5 నుంచి 21 సంవత్సరాలలోపు ఉండాలని తెలిపారు.

ట్యాంకర్ల ఏర్పాటుకు అనుమతివ్వండి

● సీఎస్ జవహర్ రెడ్డిని కోరిన జిల్లా కలెక్టర్

కర్నూలు (సెంట్రల్): నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్ల ఏర్పాట్లు అనుమతి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డిని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన కోరారు. గురువారం విజయవాడ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలపై సీఎస్ సమీక్షించారు. జిల్లాలోని పరిస్థితులను కలెక్టర్ వివరించారు. ఎండలు తీవ్రతరం కానున్న నేపథ్యంలో తాగునీటి ఎద్దడి నివారణ కోసం ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు అవకాశం కల్పించాలని కోరారు. కర్నూలు జిల్లాలో 13,406 పీఎంఏవై అర్బన్ కింద మంజూరు చేసిన ఇళ్లను గ్రౌండింగ్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, ఎస్పీ కార్యాలయం నుంచి ఎస్పీ జి.కృష్ణకాంత్, తన ఛాంబర్ నుంచి జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి డీఆర్వో కె.మధుసూదన్ పాల్గొన్నారు.



కర్నూలుకు వచ్చిన ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డికి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలుకుతున్న వైఎస్సార్‌సీపీ కర్నూలు నియోజకవర్గ సమన్వయకర్త ఇంతియాజ్



భక్తజనం మధ్య గ్రామోత్సవం



కోలాటం వేస్తున్న చిన్నారి



ఇరుముడితో శివమాలధారులు



శంఖానాదం

నీలకంధరా దేవా!

పాదయాత్ర భక్తులు నల్లమల మీదుగా తరలివస్తుండగా శ్రీగిరులు ఓంకార నాదంతో మారుమోగుతున్నాయి. శివ మాల ధారులు శ్రీశైలం చేరుతుండగా మల్లన్న మురిసిపోతున్నాడు. మహా శివరాత్రి ఘడియలు సమీపిస్తుండగా ఇల కైలాసం భక్తజనసంద్రంగా మారుతోంది. మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాలను కనులారా తిలకించి తన్మయత్వం పొందుతున్నారు. – సాక్షి, ఫొటోగ్రాఫర్



శివనామస్మరణలో ..



భీమునికొలును మీదుగా వస్తున్న భక్తులు



అలసి..సొలసిన పాదయాత్ర భక్తురాలు



పడవలో అక్కమహాదేవి గుహలకు వెళ్తున్న దృశ్యం

పీజీసెట్ నిర్వాహక కమిటీ సభ్యుడిగా ఆర్‌యూ వీసీ

కర్నూలు కల్చరల్: ఏపీ పీజీ సెట్–2024 నిర్వాహక కమిటీ సభ్యుడిగా రాయలసీమ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య బి.సుధీర్ ప్రేమ్ కుమార్ నియమితులయ్యారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రా రెడ్డి ఈ మేరకు ఉత్తర్వులు విడుదల చేశారు. ఉన్నత విద్యామండలి చైర్మన్, ఉన్నత విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి సభ్యులుగా ఉండే ఈ కమిటీకి సెట్ నిర్వాహక విశ్వవిద్యాలయమైన ఆంధ్రా యూనివర్సిటీ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి అధ్యక్షులుగా వ్యవహరించనున్నారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రాంత విశ్వ విద్యాలయాల వీసీల నుంచి ఆచార్య బి.సుధీర్ ప్రేమ్ కుమార్ ఈ కమిటీలో నియమితులయ్యారు. పీజీ కోర్సులు నిర్వహిస్తున్న ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల ప్రిన్సిపాళ్ల నుంచి కర్నూలు సిల్వర్‌జూబ్లీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.వి.సుబ్రహ్మణ్య కుమార్ నియమితులయ్యారు. ఈ ఉత్తర్వులను అనుసరించి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వివిధ విశ్వ విద్యాలయాలతో పాటు అనుబంధ కళాశాలల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించనున్న ఏపీ పీజీ సెట్–2024 విధి విధానాలకు సంబంధించిన సమావేశం గురువారం ఆన్‌లైన్‌లో జరిగింది. ఇందులో రాయలసీమ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య బి.సుధీర్ ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు. సెట్ నోటిఫికేషన్ విడుదల నుంచి, వివిధ కోర్సులకు సంబంధించిన సిలబస్‌ను, ప్రశ్నాపత్ర నమూనా, అర్హతలు, పరీక్షా కేంద్రాలతో పాటు, జూన్ 4 నుంచి 8వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో పరీక్షల నిర్వహణకు సంబంధించిన వివిధ అంశాలను చర్చించారు. పీజీ సెట్ నిర్వాహక కమిటీ సభ్యులుగా నియమితులైన వీసీ ఆచార్య సుధీర్ ప్రేమ్‌కుమార్‌కు వర్సిటీ విశ్వ విద్యాలయ రెక్టార్ ఆచార్య ఎన్‌టికే నాయక్, రిజిస్ట్రార్ ఆచార్య నాగుల అంకన్న, సైన్స్‌కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సీవీ కృష్ణారెడ్డి, డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య సుందరానంద పుచ్చ, రీసర్చ్ డైరెక్టర్ ఆచార్య సి.విశ్వనాథ రెడ్డి, లీగల్ సెల్ డైరెక్టర్ ఆచార్య ఆర్.భరత్‌కుమార్‌తో పాటు వివిధ శాఖల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

కర్నూలు డీఎఫ్‌ఓగా శ్యామల

కర్నూలు కల్చరల్ : జిల్లా అటవీ శాఖ అధికారిగా ఐఎఫ్‌ఎస్ పి.శ్యామల నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాలు జారీ చేశారు. కర్నూలు డీఎఫ్‌ఓగా విధులు నిర్వహిస్తున్న శివశంకర్‌రెడ్డిని అటవీ శాఖ పీసీసీఎఫ్ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడు



విద్యార్థి జస్వంత్ వీపుపై ఉన్న వాతలు

దేవనకొండ: వినలేదన్న కోపంతో విద్యార్థిని ఓ ఉపాధ్యాయుడు చితకబాదాడు. ఈ ఘటన మండలకేంద్రమైన దేవనకొండలోని ఎఫ్ఆర్ హైస్కూల్‌లో చోటుచేసుకుంది. పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థి జస్వంత్‌ను పాఠశాల హెచ్‌ఎం విచక్షణారహితంగా కొట్టారు. విద్యార్థి వీపుపై ఉన్న వాతలను చూసిన తల్లిదండ్రులు పాఠశాల యాజమాన్యంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మౌలిక వసతులకు అధిక ప్రాధాన్యం

● ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు:కర్నూలు నగరంతో పాటు, కల్లూరు అర్బన్ కాలనీలో మౌలిక వసతులకు అధిక ప్రాధాన్యమిస్తున్నామని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం రాత్రి కల్లూరు అర్బన్ 35వ వార్డు చెన్నమ్మ సర్కిల్ నుంచి సుంకులా పరమేశ్వరి ఆలయం వరకు రూ.1.20 కోట్లతో నిర్మించిన బీటీ రోడ్డు, సెంట్రల్ మీడియన్, సెంట్రల్ లైటింగ్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ కర్నూలు నగరంతో పాటు కల్లూరు అర్బన్ కాలనీలో వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఎన్నికలు సమీపిస్తుడండంతో టీడీపీ నాయకులు చెప్పే అబద్ధపు మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దన్నారు. గత టీడీపీ పాలనకు ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనకు తేడాను గమనించి మంచి చేసే ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేణుక, కార్పొరేటర్ మాధురి తదితరులు పాల్గొన్నారు.

సివిల్ ఇంజినీరింగ్‌కు మంచి భవిష్యత్తు



ఆర్‌యూ వీసీకి రూ.50 వేల విరాళం అందజేస్తున్న కృష్ణా నాయక్

కర్నూలు కల్చరల్: సివిల్ ఇంజనీరింగ్‌కు మంచి భవిష్యత్తు ఉందని రహదారులు, భవనాల శాఖ విజయవాడ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్.కృష్ణానాయక్ అన్నారు. గురువారం రాయలసీమ విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు జరిగిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రహదారుల విస్తరణ, గృహ నిర్మాణం, వంతెనలు, ఆనకట్టల నిర్మాణాలను విస్తృతంగా చేపడుతున్న నేపథ్యంలో సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థుల ఉపాధికి ఢోకా లేదన్నారు. రహదారులు, భవనాల శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వై.శశిభూషణ్ మాట్లాడుతూ.. విద్యార్థులు పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా సివిల్ ఇంజనీరింగ్‌లో జరుగుతున్న నూతన ఆవిష్కరణలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వర్సిటీలో నీటి కొరతను అధిగమించడానికి రహదారులు భవనాల శాఖ విజయవాడ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్.కృష్ణా నాయక్ గురువారం రూ.50 వేలను వైస్ చాన్స్‌లర్ ఆచార్య బి.సుధీర్ ప్రేమ్ కుమార్‌కు విరాళంగా అందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.హరిప్రసాద రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఈసీఈ విభాగాధిపతి జి.వినోద్‌కుమార్, ఇంజనీరింగ్ కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారి ఫరీదా, వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య నాగుల అంకన్న తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఏసీఎఫ్‌పై విచారణకు ఆదేశం

కర్నూలు కల్చరల్ : అటవీ శాఖ రిటైర్డ్ అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (ఏసీఎఫ్) బీఎం చాణక్య రాజుపై విచారణకు ఆదేశిస్తూ ప్రభుత్వం గెజిట్‌ను విడుదల చేసింది. ఈయన 2006లో కర్నూలు ఎఫ్ఆర్వోగా విధులు నిర్వహించారు. ఆ సమయంలో అటవీ శాఖ 5 కిలోమీటర్ల పరిధిలో కోత మిషన్లకు అనుమతించి నిబంధనలు ఉల్లంఘించారు. దీనిపై త్వరలో విచారణ జరగనుంది.

పారదర్శకంగా పోలింగ్ స్టేషన్ల మార్పు, చేర్పులు

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలో 10 పోలింగ్ స్టేషన్ల మార్పు, చేర్పులను పారదర్శంగా చేపట్టినట్లు నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ తెలిపారు. గురువారం కమిషనర్ తన చాంబర్‌లో రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్లకు ఇబ్బందులు లేకుండా పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటికే రాజకీయ పార్టీల సూచనలు తీసుకున్నట్లు చెప్పారు. పోలింగ్ స్టేషన్లకు సంబంధించిన ఏవైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కర్నూలు అర్బన్ ఏఈఆర్‌ఓ మోహన్‌కుమార్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ధనుంజయ, టౌన్‌ప్లానింగ్ సూపరింటెండెంట్ సుబ్బన్న పాల్గొన్నారు.

ఉద్యోగులకు ఇక ఒకేచోట అన్ని రకాల సేవలు



ఆర్థిక భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి బుగ్గన

కర్నూలు(అగ్రికల్చర్): ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు, పెన్షనర్లకు ఒకే చోట అన్ని రకాల సేవలు అందే విధంగా సమీకృత ఆర్థిక భవనాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి తెలిపారు. రూ.13.45 కోట్లతో అపార్టుమెంట్ తరహాలో 16.50 సెంట్ల స్థలంలో నిర్మించిన ఆర్థిక భవనాన్ని మంత్రి గురువారం ప్రారంభించారు. కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్ఎస్ రావత్, ఖజానా శాఖ డైరెక్టర్ మోహన్‌రావు, వర్క్ అండ్ అకౌంట్స్ డైరెక్టర్ మల్లేశ్వరారావు, స్టేట్ ఆడిట్ డైరెక్టర్ విజయభారతి, ఏపీజీఎల్ఐ డైరెక్టర్ రెడ్డి శ్రీనివాస్, ఏపీఈడబ్ల్యూఐడీసీ డైరెక్టర్ దీవన్‌రెడ్డి, సీఈ గోపిచంద్, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, శాసనమండలి సభ్యుడు మధుసూదన్, కర్నూలు నియోజకవర్గ వైఎసార్‌సీపీ సమన్వయకర్త ఇంతియాజ్ పాల్గొన్నారు. భవనంలోని వసతులను మంత్రి పరిశీలించారు. ఆర్థిక శాఖకు సంబంధించిన ఖజానా, స్టేట్ ఆడిట్, ఏపీజీఎల్ఐ, పే అండ్ అకౌంట్స్ జిల్లా కార్యాలయాలు ఆర్థిక భవనం వేదికగా సేవలు అందిస్తాయని తెలిపారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జిల్లా ట్రెజరీ అధికారి రామచంద్రరావు, స్టేట్ ఆడిట్ ఆర్‌డీడీ గోవిందప్ప, జిల్లా అధికారి రమేష్‌బాబు, ఏపీజీఎల్ఐ జేడీ కృష్ణ, ఏపీఈడబ్ల్యూడీసీ ఎస్ఈ ఎన్.నాగేశ్వరరావు, నంద్యాల జిల్లా ట్రెజరీ అధికారి లక్ష్మిదేవి, కర్నూలు ట్రెజరీ ఏటీవో జయలక్ష్మి, కార్పొరేటర్ సత్యనారాయణమ్మ, ఆయా శాఖల ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో హొళగుంద వాసి మృతి



మల్లికార్జున (ఫైల్)

హొళగుంద: శ్రీశైల మల్లన్న దర్శనానికి వెళ్లిన హొళగుంద నివాసి, స్థానిక పంచాయతీ కార్యలయ కాంట్రాక్ట్ సిబ్బంది మాల మల్లికార్జున (28) గురువారం తిరుగు ప్రయాణంలో అనారోగ్య కారణాలతో మృతిచెందాడు. శివమాల ధరించిన మల్లికార్జున రెండు రోజుల క్రితం ఇరుముడితో వాహనంలో శ్రీశైలానికి బయలుదేరారు. అక్కడ స్వామి దర్శనం అనంతరం తిరుగు ప్రయాణం అయ్యేందుకు సిద్ధమవుతుండగా తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య శశికళ, రెండేళ్ల కుమారుడు ఉన్నారు.

ఇక ఆన్‌లైన్‌లో ఏపీజీఎల్ఐ సేవలు

● ఏపీజీఎల్ఐ డైరెక్టర్ రెడ్డి శ్రీనివాస్



డైరెక్టర్ రెడ్డి శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న ఏపీజీఎల్ఐ అధికారులు

కర్నూలు(అగ్రికల్చర్): ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఏపీజీఎల్ఐ సేవలన్నీ ఇకపై ఆన్‌లైన్‌లో నిధి పోర్టల్ ద్వారా జరుగుతాయని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జీవిత బీమా డైరెక్టర్ రెడ్డి శ్రీనివాస్ తెలిపారు. త్వరలోనే నిధి పోర్టల్‌ను ప్రారంభించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఆయన వెల్లడించారు. గురువారం ఆయన కర్నూలులో విలేకరులతో మాట్లాడుతూ... నిధి పోర్టల్ ద్వారా ఏపీజీఎల్ఐ సేవలను డీడీవో స్థాయిలోనే పొందవచ్చని పేర్కొన్నారు. బీమాకు సంబంధించిన బాండ్లు కూడ నిధి పోర్టల్ నుంచి పొందవచ్చని పేర్కొన్నారు .ఏపీజీఎల్ఐ కార్యాలయం డేటాను భద్రపరుస్తుందని తెలిపారు. ఇప్పటి వరకు ఏపీజీఎల్ఐ సేవల కోసం ఉద్యోగులు, ఉపాధ్యాయులు జేడీ కార్యాలయానికి రావాల్సి ఉందని, ఇకపై అన్ని రకాల సేవలు నిధి పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో పొందవచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ రెడ్డి శ్రీనివాస్‌ను ఏపీజీఎల్ఐ అధికారులు సత్కరించారు. కార్యక్రమంలో ఏపీజీఎల్ఐ జేడీ కృష్ణ, ఏడీ గౌరి ప్రసన్న, సూపరింటెండెంట్లు పి.రామకృష్ణారెడ్డి, మాధవీకళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

కర్నూలు (లీగల్): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకటనాగ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయ సేవా సదన్ భవన్‌లో గురువారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మహిళా దినోత్సవ విశిష్టతను తెలియజేశారు. అనంతరం వివిధ క్రీడాంశాల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ ప్రజాప్రయోజనాల సేవల సంస్థ అధ్యక్షుడు ఎం.వెంకటహరినాథ్, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ, సాధికారత అధికారి వెంకటలక్షుమ్మ, సీడబ్ల్యూసీ కమిటీ చైర్మన్ జుబేదా బేగం, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మనోహర్, సెట్కూరు సీఈఓ రమణ, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన మహిళా అధికారులు, ఉద్యోగినులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డులో అగ్నిప్రమాదం

కర్నూలు (అగ్రికల్చర్) : కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులోని రైపనింగ్ చాంబర్‌లో గురువారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. మార్కెట్ యార్డులో ఎండు మిర్చి, కూరగాయలు, పండ్లు నిల్వ చేసుకునేందుకు రైపనింగ్ చాంబర్ నిర్మించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. రెండు ఏసీలు, జనరేటర్‌తో పాటు రైపనింగ్ చాంబర్‌కు సంబంధించిన మెటీరియల్ కాలి బూడిదైపోయింది. ప్రమాదంతో దాదాపు రూ.20 లక్షల వరకు నష్టం జరిగి ఉంటుందని అధికార వర్గాలు తెలిపాయి.

రూ.3 లక్షలు అపహరణ

ఆదోనిఅర్బన్: పట్టణంలో ఆర్‌డబ్ల్యూఎస్ సీనియర్ అసిస్టెంట్ చెన్నయ్య బ్యాంకులో డబ్బులు డ్రా చేసుకుని బైకులో పెట్టి ఆఫీసుకు వెళ్లడంతో గురువారం చోరీ జరిగింది. బాధితుడు చెన్నయ్య టూటౌన్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు.. ఎస్‌బీఐ బ్యాంకులో రూ.3 లక్షలు డ్రా చేసుకుని కవర్‌లో చుట్టి తన బైకు సైడ్ బ్యాగులో పెట్టి ఎదురుగా ఉన్న ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలోకి వెళ్లారు. కార్యాలయంలో నీరు తాగి తిరిగి వచ్చి చూడగా బ్యాగులో డబ్బు మాయమయ్యాయి. దీంతో అవాక్కైన చెన్నయ్య వెంటనే టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కార్పొరేషన్ బ్యాంకులో లోన్ చెల్లించేందుకు నగదు డ్రా చేసినట్లు బాధితుడు వాపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ సీఐ గోపి తెలిపారు.

రసాయన విపత్తుల నివారణపై ప్రత్యేక దృష్టి

కర్నూలు (సిటీ): రసాయన విపత్తుల నివారణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నాగప్రసన్న లక్ష్మి, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఐ.నారాయణరెడ్డి తెలిపారు. గురువారం కర్నూలు రూరల్ మండల పరిధిలోని గొందిపర్ల దగ్గర ఉన్న టీజీవీ రాయలసీమ ఆల్కలీస్, అలైడ్ కెమికల్స్ లిమిటెడ్ ఫ్యాక్టరీలో ఎమర్జెన్సీ మాక్ డ్రిల్ నిర్వహించారు. ఫ్యాక్టరీ దగ్గర రసాయన విపత్తులు జరిగిన సమయంలో స్థానిక ప్రజలను, సిబ్బందిని పునరావాస కేంద్రాలకు ఎలా తరలించాలి, క్షతగాత్రులకు ఎలాంటి వైద్యసేవలు అందించాలి అనే అంశాలపై ప్రత్యక్షంగా డ్రిల్ చేసి చూపించారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ డీపీఎం అనుపమ, కాలుష్య నియంత్రణ మండలి అధికారి మునిప్రసాద్, డీటీసీ శ్రీధర్, పబ్లిక్ హెల్త్ ఈఈ చంద్రమోహన్, విద్యుత్ శాఖ ఈఈ రమేష్, డీఎంహెచ్ఓ రామగిడ్డయ్య, తహసీల్దార్ రామాంజులు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

భారీగా కర్ణాటక మద్యం స్వాధీనం

● కారు సీజ్.. పరారీలో నిందితుడు



పట్టుబడిన కర్ణాటక మద్యంతో సెబ్ పోలీసులు

ఆలూరు రూరల్: కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా తరలిస్తున్న రూ.1.81 లక్షల విలువైన అక్రమ మద్యాన్ని సీజ్ చేసినట్లు ఆలూరు సెబ్ సీఐ సోమశేఖర్ తెలిపారు. గురువారం సాయంత్రం ఆయన స్థానిక సెబ్ పోలీసు స్టేషన్‌లో ఆవరణంలో సెబ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో వివరాలు వెల్లడించారు. సెబ్ సూపరింటెండెంట్ రవికుమార్ ఆదేశాల మేరకు ఉదయం హాలహర్వి మండల కేంద్రం వద్ద వాహన తనిఖీలు చేపట్టామన్నారు. హాలహర్వి నుంచి నిట్రవట్టి క్రాస్ రోడ్డులో మారుతి స్విఫ్ట్ కారులో అక్రమంగా తరలిస్తున్న 30 బాక్సుల కర్ణాటక మద్యం (2,880 ఒరిజన్ ఛాయిస్ 90 ఎంఎల్) స్వాధీనం చేసుకుని కారును సీజ్ చేశామన్నారు. డ్రైవర్ పరారీలో ఉన్నాడని చెప్పారు. కర్ణాటకకు చెందిన ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ సోమశేఖర్ తెలిపారు. సిబ్బంది విజయుడు, విజయ్ పాల్గొన్నారు.

సారా స్థావరాలపై సెబ్ దాడులు

కర్నూలు : కర్నూలు సెబ్ స్టేషన్, డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ (డీటీఎఫ్) అధికారులు కలసి గురువారం ఓర్వకల్లు మండలం గుడుంబాయి తండా, గుమ్మితం తండాల్లో ఉన్న నాటుసారా స్థావరాలపై విస్తృత దాడులు నిర్వహించారు. 1700 లీటర్ల బెల్లం ఊటను, 50 లీటర్ల నాటుసారాను ధ్వంసం చేశారు. నాటుసారా విక్రయిస్తున్న కాల్వబుగ్గకు చెందిన ఎం.శ్రీనివాసులును అరెస్టు చేసినట్లు కర్నూలు సెబ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె.ఆర్.రాజేంద్రప్రసాద్ తెలిపారు. డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ నరసా నాయుడు, ఎస్ఐ రెహానా బేగం పాల్గొన్నారు.